# అథోలోకం

అబ్బబ్బ... ఎంత అసహ్యకరమైన చప్పుడు... నీకే ఉందా కారు... అంత భయంకరమైన హారన్ పెట్టుకోవడానికి... "కాంట్యూ ఎనౌన్స్ యువర్ కమింగ్ లైకే జంటిల్మన్?" అన్నాడు ఏ.జి. గార్డ్‌నర్ (ఆన్ ది రూల్ ఆఫ్ ది రోడ్)... చిన్ననాడు చదువుకున్నదేదీ వెంట వెంటనే మరచిపోయే ఒక గొప్ప అలవాటు మనకు లేదన్నమాట. మన జ్ఞాపకశక్తి అద్భుతం. అందుకే బోలెడంత చెత్త ఈ బుర్రలో యెప్పుడూ మెదలుతూ ఉంటుంది. అనవసర విషయాల్ని జ్ఞాపకం ఉంచుకోవడం- దానివల్ల అరిష్టాలు... ఎవరో ఎక్కడో రాయగా చదివినట్టు జ్ఞాపకం... యేదీ జ్ఞాపకం రాదే- మాలతీ చందూర్ అనుకుంటాను ప్రమదావనంలో. ఆంధ్రప్రభ యిప్పుడు పూర్తిగా ఆడవాళ్ళ పత్రికగా మారిపోయిందేమిటి? ఆ పత్రిక నిండా రచయిత్రుల పేర్లు తప్ప రచయితల పేర్లు మచ్చుకైనా కనిపించవే? ఏ సీతో, కౌసల్యో అని పేరు పెట్టుకొని మనమూ ఓ కథో, నవలో రాసిపారేస్తే మనకూ బహుమానం వచ్చేట్లుంది. అయినా ఈ రోజుల్లో ప్రతీవాడూ కథలు రాసేవాడే. ఆమధ్య యేదో పత్రికలో చదివాడు... ఆంధ్రదేశంలో 1200 మంది కథకులున్నారని. ఆ పత్రిక నిర్వహించిన కథల పోటీలో పాల్గొన్నారని. ఈ పోటీకి రాయని కథకులెందరో? యింతమంది కథకులే అయితే ఆ కథల్ని చదివేవాళ్ళు కనీసం అంతమందైనా ఉన్నారా అని... మాలతీ చందూర్ జవాబులు బావుంటాయి. పూర్వాపరాలు బాగా చెబుతుంది... ఆమె 'చంపకం-చెదపురుగులు' మనిషిలోని పశుత్వాన్ని చాలా చక్కగా చూపిస్తుంది. పూర్ చంపకం! తోటి స్త్రీలోని ఈర్ష్యా ద్వేషాలలో మాడిపోయిన ఒక కన్నీటికణం! మనిషిలో ఇంతటి ఈర్ష్యాద్వేషాలు ఎందుకుంటాయో. "అన్నీ ప్రశ్నలే ఈ ప్రపంచంలో... సమాధానాల్లేవు" అంటాడు శ్రీశ్రీ. ఈ సమాధానాల కోసం ఎందరు మేధావులు ఎంతగా ప్రయత్నిస్తున్నారో! యిదేమిటీ... ఇవ్వాళ యింత సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు? ఇదంతా హెవీ స్టఫ్... ముళ్ళపూడి గారి హెవీస్టఫ్, లైట్‌స్టఫ్‌ల నిర్వచనాలు - నవ్వొచ్చింది. ముళ్ళపూడి బుర్రలో మెదిలితేచాలు నవ్వొచ్చేస్తుంది. యెంత నడచినా రూం రాదేం? అయినా ఎందుకొచ్చినట్టు హాస్టల్ నుంచి కోఠీవరకు... ఎక్కడా పొద్దుపోక... సాయంత్రం అయ్యేటప్పటికి కోఠీకి రాకుండా వుండడం యెంత కష్టం? ప్రతిరోజూ ఇలా సాయంత్రాలు ఏ పనీ పాటా లేకుండా ఇక్కడికి వచ్చే ఒక స్టూడెంటులోని యీ మనస్తత్వాన్ని ఓ సైకియాట్రిస్టు యెట్లా ఎనలైజ్ చేస్తాడో. ఏ

ఇన్‌స్టింక్టు ఏమోటివ్ అతన్ని యిట్లా డ్రైవ్ చేస్తున్నదో. ఈమధ్య సైకాలజీమీద యెక్కడలేని ఇంటరెస్టు పుట్టుకొస్తున్నది. అదుగో మళ్ళీ హారన్. ఈ కారు హారన్ వింటేనే యెక్కడలేని ఇరిటేషన్ పుట్టుకొస్తుంది. కారులో వాళ్ళని చూస్తే వాళ్ళు ఎందుకో మనకి శత్రువులని పిస్తుంది. "వడ్డించిన విస్తరి మీ జీవితం!" జ్ఞాపకం వస్తోంది. ఇది నీకు కారు లేదన్న వొక యేడుపు, వాడికి వుందన్న వొక జెలసీ కారణం కావచ్చు. నీకే కారుంటే యిలా ఆలోచించేవాడివేనా? ఈ ప్రశ్నలకేంగాని ఆ కారులో ఉన్న అమ్మాయి కాస్త అందంగా ఉన్నట్లుందే. సరిగ్గా చూళ్ళేదు... మిస్‌డ్ ఎ ఛాన్స్... అదేమిటి ఆ బోర్డు? 'తీన్ కన్య' లిబర్టీలో... సత్యజిత్ రే చాలా గొప్పవాడనిపిస్తాడు, ఆయన సినిమా వొక్కటైనా చూడకున్నా, కొంతమంది రచయితలు కూడా అలాగే... షేక్స్పియర్ రాసిన వొక్క పంక్తి చదవకున్నా అతడు చాలా గొప్పవాడనిరాస్తాడు. కాళిదాసుకన్నానా? యెవడో విమర్శకుడు కాళిదాసును షేక్స్‌పియర్ ఆఫ్ ఇండియా అన్నాడట. నాన్‌సెన్స్. క్లియోపాట్రా ముక్కు ఇంకాస్త పొట్టిగా ఉంటే ప్రపంచ చరిత్రే మారిపోయేది అన్నాడట ఎవడో చరిత్రకారుడు. క్లియోపాట్రా మొన్ననే వచ్చింది. అబ్బ! ఎలిజబెత్ టేలర్ ఎంత బ్యూటిఫుల్‌గా, ఎంత సెక్సీగా వుందో! ఒక సీన్‌లో పూర్తిగా నేకెడ్‌గా యాక్టు చేసిందట. ఆ సీన్‌లో ఆమెను అట్లా చూడటం నా జీవితంలో మరచిపోలేని అనుభవం అన్నాడట రిచర్డు బర్టన్... వాటే లక్కీఫెలో..? పాడు ఇండియన్ సెన్సార్ ఆ సీన్ను కట్ చేసింది. ఆ అద్భుత దృశ్యాన్ని ఈ పాడు సెన్సార్ చూడనిస్తుందా? ఈ సెన్సార్ అనేది లేకుంటే ఎంత బాగుండేది. సెన్సార్ కత్తెరకు నిర్దాక్షిణ్యంగా బలైన యెన్ని మార్లిన్ మన్రో పిక్చర్సు, యెన్ని బ్రిగిటీ బార్డాట్ పిక్చర్లు యేడుస్తూ చూశాం! మనం ఏ సెన్సార్ బోర్డు మెంబరో అయితే యెంత బాగుండును! లేక యే ఫ్రాన్స్‌కో, యిటలీకో వెళ్ళి వీళ్ళ పిక్చర్స్ చూసొస్తే! అక్కడ సెన్సారింగ్ అనేదే ఉండదట!

అదుగో మళ్ళీ కారుహారన్, రిక్షావాళ్ళ చప్పుడు, అబిడ్స్‌లో పాన్ కొట్టు... న్యూస్‌స్టాండ్‌లో రకరకాల మాగజైన్స్, రకరకాల పుస్తకాలు.... ఆ షాపు ముందు నిల్చున్నాడు. యేమేం పేపర్లు వున్నాయో చూడాలనిపిస్తోంది. మహ కొనేవాడిలాగా యిట్లా చూడటం యెందుకో? యేదో దాహం... యేదో ఆకలి, యెక్కడో యేదో మనస్సుకు మత్తెకించే దృశ్యం కన్పిస్తుందన్న ఎన్నడూ తీరని ఆశ. అదిగో లైట్ అండ్ షేడ్ మీద న్యూడ్... ఫెయిర్ సెక్స్ మీద శరీరాన్ని పులకింపచేస్తున్న ఆ న్యూడ్!... అబ్బ! ఎన్నని చూడటం, అదిగో 'హిందూనేశన్' - బి. సరోజాదేవిని గూర్చి... "కొంపదీసి ఎవరైనా చూస్తున్నారా? తలుపుచాటు నీతిమనది. కొంచెం దగ్గరగా

వుంటే బాగుండేది. సరిగా కనిపించటం లేదు. ఒక కాపీ కొంటే? ఛీ! బుద్ధిలేదు. మొదట జేబులో బస్సు కిరాయిలేదు, తర్వాత... ఓ బి.ఏ. చదువుతున్న విద్యార్థి, యెంతో సివిలైజ్డ్ అండ్ కల్చర్డ్ అనుకుంటున్న విద్యార్థి 'హిందునేషన్' చదవడమా? షేమ్... షేమ్...! యింకా యెంతసేపు యిట్లా చూస్తూ నిల్చోవడం? అదిగో షాపువాడు 'నీపని యింతేనా?' అన్నట్టు చూస్తున్నాడు. యిక్కడ నుంచి కదలాలి, ఛీ! హాస్టలు రూమ్ యెంతకూ రాదేం? అదిగో ఆ రిక్షాలో పోతున్న అమ్మాయి కాస్త బాగున్నట్టుంది. సాధనా హెయిర్ స్టయిల్ ఆ ముఖానికి యింకాస్త అందాన్నిచ్చిందేమో. ఈమధ్య సాధన హెయిర్ స్టయిల్ చాలా పాప్యులర్ అయిపోతోంది. సాధన ఎంత అందంగా వుంటుందో! హౌ ప్రెటీ షి యీజ్! ఆండ్రీ హెబ్బర్న్ ఆఫ్ ఇండియా!

'తుఝే జీవన్‌కీ డోర్‌సే బాంద్ లియాహై...' యిదేమిటి పైకే పాడేస్తున్నాడు. వ్వాట్ నాన్‌సెన్స్! సినిమాలు యింత విరివిగా చూడటం ఈ యంగ్ పీపుల్‌ని యెన్ని రకాలుగా పాడుచేస్తోందో వివరిస్తూ వొక వ్యాసం రాయాలి. సినిమా వుత్త పాసివ్ ఎంటర్టయిన్‌మెంట్ అన్నాడు రసెల్... పాపం... రసెల్ నిజంగా ఎంత గొప్పవాడు! ఎనభయ్యేవడిలో వున్నా అతనికి యింకా ప్రపంచాన్ని యుద్ధం నుంచి రక్షించాలన్న ఆరాటం! ఆ వయస్సులో జైలుకి పోవడం, గ్రేట్... రియల్లీ గ్రేట్... అరె... యెంత మంచిపాట వినిపిస్తున్నది. "ఛలో యేక్ బార్ ఫిర్‌సే అజ్‌నభీ బన్‌జాయే హమ్ దోనో" కాస్సేపు ఆగి వినిపోదాం.... ఆగాడు. అట్లా వస్తున్న ఎర్రచీరె కట్టుకున్నామె మా కాలేజి స్టూడెంటు 'కుముదిని' లాగుందే? ఔను... ఆమే! ఆ చీరెలో ఎంత అందంగా వుంది? ఆ విశాలమైన కాటుకకళ్ళు, స్వచ్ఛమైన నీటిలో తళతళ మెరుస్తున్న చంద్రబింబంలాంటి ముఖానికి ఎంత ప్రకాశాన్నిస్తున్నాయి... పోతపోసిన విగ్రహంలాగా వున్న ఆమె అవయవాల పొందిక... యౌవనం ఆమె ప్రతి అంగంలోనూ వెల్లివిరుస్తోంది. కీట్సు అనుకున్న 'ఎ థింగ్ ఆఫ్ బ్యూటీ' యీమేనేమో! ఆమెను ఇలాగే చూస్తూ ఉండిపోతే కవిత్వం రాసిపారేసేటట్లున్నాడు. ఇంత చక్కటి సాయంత్రం ఎక్కడికి వెళ్తున్నదో... "యేకాంతమూ, సాయంత్రమూ యెద నీకై వెదికేనూ"... యిదేమిటి మళ్ళీ పాడేస్తున్నాడు. వ్వాటే బ్యూటిఫుల్ సాంగ్! అంత గొప్ప పాటను తనిలా పాడటం ఎవరైనా వింటే నవ్వుతారు. ఇవ్వాళే "రోడ్‌సైడ్ రోమియోలు" అని యేదో పత్రిక ఆడపిల్లల్ని ఏడిపించే వారిని గురించి ఎడిటోరియల్ వ్రాసింది. ఎన్నిసార్లు ఈ కుముదినిని కాలేజీలో చూశాం. అయినా ఎప్పటికప్పుడు ఆమెలో యేదో ఒక వినూత్నమైన అందం శోభిస్తుందేమిటి? మిస్ కాలేజ్, మిస్ ఇండియా ఆమాటకొస్తే మిస్ వరల్డ్‌కి కూడా కంటెస్ట్ చెయ్యవలసిన యువతి యీమె.

బ్రిగిటీ బార్డాట్‌లాగా ఎక్సయిట్‌మెంట్‌ను, స్టార్మ్‌ను సృష్టించగల యువతి... "ఆడదాని వోరచూపులో జగాన వోడిపోని ధీరుడెవ్వడూ" రికార్డు మార్చాడు హోటలువాడు. ఛీ దర్టీసాంగ్... ఐనా వినడానికి బాగానే వుంది. రోడ్డుమీద ప్రజలంతా ఆమెనే చూస్తున్నట్టున్నారు. ఆడదాని వోరచూపులో... యిదేమిటి పాడు అలవాటు. మళ్ళీ పైకి పాడేస్తున్నాడు. అరే! అతడు... ఆ వైటుసూటులో వున్నతడు... మా లెక్చరర్ కమలాకరరావు. అతడిక్కడున్నాడే? అతడిక్కడ... ఈ దర్టీ హోటల్ ముందు నిల్చోవడమేమిటి? ఎవరికోసమో వెయిట్ చేస్తున్నట్టున్నాడు... ఎవరికోసం అయ్యుంటుంది? అబ్బ తెలిసింది, ఓహో! బ్రహ్మాండమైన రహస్యం తెలిసింది. అబ్బ హృదయమెంత తేలికపడింది. ఇన్నాళ్ళ నుంచి కాలేజీలో వున్న రూమర్స్‌ను రూమర్సేకదా అని పట్టించుకోలేదు. అయినా వాళ్ళతో, వీళ్ళతో చెప్పకుండా ఊరుకున్నాడా? లేదు... అయినా చెప్పితే మాత్రం వెంటనే రూమర్స్ భాయీ సీరియస్ తీసుకోవద్దు... అనలేదూ? కుముదినీ, కమలాకర్‌రావుకు యేదో సంబంధం వుందని కాలేజీ గోడలన్నీ ఘోషించినయ్. గోడలమీద అంత అసహ్యంగా రాయడం ఎంత ఘోరం. ఇటీజ్ టూ యిన్‌డీసెంట్ ఆన్ ది పార్టు ఆఫ్ ది స్టూడెంట్స్... యెవరో ఆ పనిచేసింది? అయితే యిప్పుడు వాళ్ళిద్దరూ ఇక్కడికొచ్చి కలసి పోతున్నారన్నమాట. ఛలో యెక్ బార్ ఫిర్ సే... అజ్‌నబీ బన్‌జాయె... ఛీ! మళ్ళీ అదేపాట. కాలేజీలో చెప్పుకునేవన్నీ నిజమేనన్నమాట. యెంత అమాయకుణ్ని. అవన్నీ నమ్మలేక పోయేవాడిని. "టైమెంతైంది సార్?" వీడెవడు? ఈ దేశంలో గడియారం పెట్టుకోవడం పాపం! ప్రతీవాడు టైం అడిగేవాడే! అబ్బ! నీకు గనక వుందిలేవోయ్ ఆ టోడివాచీ... ఐనా యింత సీరియస్‌గా ఆలోచిస్తోంటే యీ డిస్టర్బెన్స్ యేమిటి? "ఊఁ ఆరున్నర... కాదు ఆరు ముప్పైరెండు". యెంతవరకొచ్చింది? ఆ! వాడు... మురళి ప్రచారం చేసేవన్నీ నిజమే నన్నమాట. వాళ్ళిద్దరూ కలిసి సినిమాలకు పోతోంటే, రిక్షాలలో చెట్టపట్టాలేసుకొని పోతోంటే, యిద్దరూ ఒకరి కౌగిట్లో ఒకరు మైమరచిపోతోంటే ... వాడు చూశాట్ట? ఐనా ఈ దృశ్యాలన్నీ వాడెట్లు చూడగల్గెను? యెంతసేపు ఇట్లా నిల్చోవడం? పాటల మీదికి మనస్సు పోవడం లేదు.

యిప్పుడు వాళ్ళిద్దరూ కలసి ఎటు పోతున్నారో? యెటుపోతారు? యే పబ్లిక్ గార్డెన్‌కో, యే టాంకుబండ్‌కో వెళ్ళి హాయిగా "యెంత హాయి ఈ రేయి యెంత మధుర మీహాయి" అని పాడుకుంటూ... మళ్ళీ పాట పాడేస్తున్నాడు... లోకాన్ని యిట్లా కన్ను గప్పి వీళ్ళు చేస్తున్న పని యిదా? వాళ్ళేమన్నా చేసుకోనీయ్!

నీకెందుకింత యేడుపు? యేం? వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు. అట్లాగే తిరుగుతారు. మధ్య నీ సొమ్మేం పోయింది? ఔను. యిదేమిటి నేనిట్లా ఫీలవుతున్నాను? వాళ్ళ ప్రేమను వోర్వలేని జెలసీనా యిందుకు కారణం? వాళ్ళందరూ అట్లా గోడలమీద ఆ అసభ్యకరమైన రాతలన్నీ రాసినప్పుడు తను ఎంత బాధపడ్డాడు! అది అన్యాయమనీ, అనాగరికమనీ ఎంతోమందితో వాదించాడు. వాదించావులే... ఎక్కడెక్కడ యేమేం వ్రాశారో తెలుసుకొని అవన్నీ చదివి మరీ వచ్చావు. యురినల్స్‌లో, లేవెట్రీస్‌లోని బొమ్మలను, రాతలను యెన్నిసార్లు చదువలేదు? యేమిటో ఈ ఇన్‌స్టింక్ట్స, యేమిటో ఈ క్యూరియాసిటీ! దీనికంతా కారణమేమిటో... ఒకసైకియాట్రిస్టు దగ్గరకు వెళ్ళి తనలోని ఈ చెత్తను గురించి చెబితే బాగుండును.

అబ్బబ్బ! యేమిటో ఈ చెయిన్‌లాంటి ఆలోచనలు, యెడతెగని యెడతెరపి లేని ఆలోచనలు, యిక ఆలోచించను. ఐ యామ్ టైర్డ్ ఆఫ్ దిస్ హేబిట్. ఛలో యెక్‌బార్ ఫిర్‌సే... యిదేమిటి? ఈ పాట యిలా రింగ్ ఔతోంది. హాంటింగ్ అంటే యిదేనేమో? వాళ్ళిద్దరూ పాటలు పాడుకుంటారా? యీ పాటికి యెక్కడున్నారో? ఒకరి కౌగిలిలో యింకొకరు, ఒకరి పెదవులతో యింకొకరి పెదవులు... రాక్ హడ్సన్-జినాలోలో బ్రిగడా లాగ... 'కమ్ సెప్టెంబర్'లో లాగ... ఓహ్! వాటే లైఫ్... ఛీ మన బతుకంతా యింతే. యెడారి. యెడతెగని యెడారి. రేపు కాలేజీకి వెళ్ళడంతోటే అందరితో చెప్పాలి... వాళ్ళిద్దరూ చెట్టాపట్టాలేసుకుని హాయిగా కలిసిపోతోంటే చూశానని. ఇంకేమైనా వుందా? క్లాసెస్‌లోని నల్ల బోర్డులన్నీ తెల్లగా మారిపోతాయి. మళ్ళీ కాలేజీ గోడలన్నీ నిండుతాయి. మురళి... వాడంటే యెందుకో భయమేస్తోంది. ఇలాంటి పుకార్లని వాడు క్షణాల్లో మైళ్ళకు మైళ్ళు పరిగెత్తించగలడు.

వెరీఫాస్ట్... వాడేమైనా చేయగలలడు. రేపు "హిందునేశన్"లో వొచ్చినా రావచ్చు. మైగాడ్! యెంత ఈవిల్ తన హృదయం! ఆమె తనకేం అపకారం చేసింది? తనకెందుకు ఆమెమీద ఇంత కసి? ఏమో తనకేం తెలుసు! ఎందుకో ఈ న్యూస్ అందరికీ చెప్పాలనిపిస్తోంది, ఐ కాన్ట్ హెల్పిట్. అయినా దీంట్లో చెప్పటానికేముంది. ఆమె యేదో షాపింగుకు రావచ్చు, అతడు ఏ హోటల్లోనో కాఫీ త్రాగటానికి రావచ్చు. అట్లా వాళ్ళిద్దరూ ఒకేసారి కన్పించడం ప్యూర్లీ యాక్సిడెంటల్ అని ఎందుకనుకో గూడదు? ఏమో... అట్లా అనిపించడం లేదు, నిప్పులేందే పొగరాదు. వీళ్ళిద్దరి మధ్య యేదో లేందే కాలేజీనిండా యీ పుకార్లు యెందుకు పుడ్తాయి? అబ్బ! ఈ సమస్య ఎంత కాంప్లికేటెడ్ ఐపోయింది! ఆలోచించకూడదనుకొని మళ్ళీ యిదే

ఆలోచిస్తున్నాడు. జస్టు సీ, నువ్వు ఆమెకు ఎంత అపకారాన్ని తలపెట్టావో ఆలోచించు... నిష్కారణంగా ఆమెమీద పడిన ఈ నింద బైటి ప్రపంచానికి తెలుస్తుంది. ఆమె క్యారెక్టర్ మంచిది కాదనే ఒక ముద్ర ఆమెమీద పడిపోతుంది. ఆమెను ఎవ్వరూ పెండ్లి చేసుకోరు. ఆ బాధతో ఆమె జీవితమంతా కృంగి కృశించిపోతుంది. అదంతా నీ వూహ. కథలు, సినిమాలవల్ల వచ్చిన సంస్కారం. అది నిజం కాకూడదని ఎక్కడుంది? నిజమే ఐతే మాత్రం నీ సొమ్మేం పోయింది? నిన్నెవరు యిదంతా ప్రచారం చెయ్యమన్నారు? నీవంటి వాళ్ళంతా యీ సంఘానికి పిల్లర్స్. ఈ సంఘానికి బానిసలు. యీ సమాజం అనేదొక మిత్! వ్యక్తిని అణచటానికి ఏర్పడ్డ ఒక వ్యవస్థ... ఈ సమాజం అనేదానికొక స్పష్టమైన అర్థం లేదు. అసలు దేనికీ అర్థం లేదు. షేక్స్పియర్ అన్నట్టు యిదంతా "ఎ స్టోరీ టోల్డ్ బై యాన్ యిడియట్, ఫుల్ ఆఫ్ సౌండ్ అండ్ ఫ్యూరీ... సిగ్నిఫయింగ్ నథింగ్" యేది ఆలోచించినా కన్క్లూజన్ యిదే. ఛీ! యిక ఆలోచించను, హమ్మయ్య... రూమ్ వచ్చేసింది.

మర్నాడు కాలేజికెళ్ళాడు.

అదిగో మురళి వస్తున్నాడు. వాడితో ఈ విషయం చెప్పేద్దామను కుంటున్నావా? వొద్దు... వొద్దు... చెప్పొద్దు... చెప్పేస్తే... చెప్పేస్తే... వొద్దు... వొద్దు... చెప్పొద్దు... చెప్పొద్దు... టుబీ ఆర్ నాట్టుబీ... టుబీ ఆర్ నాట్టుబీ... వొద్దు... చెప్పొద్దు... చెప్పకూడదు... నో... చెప్పను... చెప్పనుగాక చెప్పను. కానీ చెప్పాలనిపిస్తోంది... చెప్పెయ్యాలనిపిస్తోంది. చెప్పకూడదని కూడా అనిపిస్తోంది. ఇప్పుడెలా? చెప్పడమా? మానటమా? టుబీ ఆర్ నాట్టుబీ...

హల్లో!

"హల్లో మురళీ" అన్నాడు. చెప్పేస్తావా? వొద్దు... వొద్దు. చెప్పొద్దు.

"ఏమిటి విశేషాలు?" వాడు అడుగుతున్నాడు.

"ఏమున్నాయి?" వొద్దు వొద్దు. చెప్పేస్తా... చెప్పొద్దు.

"ఏమిటి విశేషాలు?" వాడు మళ్ళీ అడుగుతున్నాడు. తనతో ఆ వార్త చెప్పించాలనే అలా అడుగుతున్నాడేమో!

"ఏమున్నాయి?" అన్నాడు. మళ్ళీ అదేమాట... వొద్దు, చెప్పేస్తావా? చెప్పొద్దు.

"యేదన్నా చెప్పు" – వాడు వదలటంలేదు.

"రాత్రి యేమయిందో తెలుసా?" అదిగో... చెప్పేస్తున్నాడు. తనకు బుద్ధిలేదు.

"ఏమయింది? ఏమయింది?" వాడికెంత ఆతురత!

"రాత్రి ఆబిడ్స్‌లో ఒక అద్భుత దృశ్యం చూశాను... మన కుముదినీ, మన లెక్చరర్ కమలాకరరావు ఒకరి భుజాల మీద ఒకరు చేతులు వేసుకొని... హాయిగా... పెండ్లి చేసుకున్న దంపతులు కూడా అట్లా ఉండరనుకో... రిక్షాలో కూర్చొని వెళ్తోంటే చూశాను" పచ్చి అబద్ధం! యింత విషం తన హృదయంలో వుందా! మైగాడ్! యింత కుళ్ళు తన హృదయంలో వుందా? "రైటో... క్రిస్టినీ కీలర్ యిన్ అవర్ ఆర్ట్సుకాలేజీ..." వాడు... మురళి అరుస్తూ పరిగెత్తుతున్నాడు. అబ్బ! యెంత అల్లరి! యెంత పాడుపని చేశాడు. యెంత దుర్బలుడు. తనూ యెప్పుడూ యింతే "ఔను నువ్వు యెప్పుడూ యింతే. చెయ్యొద్దు అనుకుంటూనే చేస్తావు. చెప్పొద్దు అనుకుంటూనే చెప్పేస్తావు. కానీ తను మారాలి. మారి తీరాలి... తనలోని ఈ చెడును సంహరించుకోవాలి... ముక్కలు ముక్కలుగా నరికేసుకోవాలి... తను మారాలి. మారి తీరాలి...

*"జయశ్రీ" మాసపత్రిక (జూలై, 1965)*

*(నేపథ్యం :* నేను వరంగల్‌లో ఆర్ట్స్ అండ్ సైన్స్‌కాలేజిలో బి.ఏ. చదువుతున్న రోజుల్లో – అంటే **1960**లో ఈ కథ రాశాను. అప్పుడా కాలేజిలో ఒక పుకారుండేది. మాకు ఇంగ్లీషు బోధిస్తున్న ఒక లెక్చరర్‌కూ, బి.ఎస్‌సీ చదువుతున్న ఒకమ్మాయికి సంబంధం ఉందనేది ఆ పుకారు. ఒక రోజు నేను బజార్లో వెళ్తోంటే వాళ్ళిద్దరు ఒకరి తర్వాతొకరు – ఆ అమ్మాయిని వెంటాడ్తూ ఆ లెక్చరర్ కనిపించాడు. నాకు వెంటనే కాలేజిలో వీళ్ళను గురించి చెప్పుకుంటున్నవి పుకారు మాత్రమే కాదేమో, నిజమేనేమో అనుకున్నాను. రేపు కాలేజికి వెళ్ళాక నేను చూసిన ఈ దృశ్యాన్ని అందరికీ చెప్పాలని కూడా అనిపించింది. అయితే నేనెవరికీ ఈ వార్త చెప్పలేదు. కానీ ఈ సంఘటన ఆధారంగా ఒక కథ రాయాలనిపించింది. మొదలు మామూలు శిల్పంలోనే ఈ కథను రాశాను. తర్వాత ఈ కథను చైతన్యస్రవంతి శిల్పంలో రాయాలనిపించింది. అలా ఈ కథను రెండోసారి రాసిన తర్వాత ఈ కథకు ఈ స్వరూపం యేర్పడింది. 'అంపశయ్య' నవల రాయటానికి కొంచెం ముందుగా రచించిన ఈ కథను ఆ నవల రాయటానికి ముందు జరిగిన ఒక రిహార్సల్‌లాంటిదని చెప్పొచ్చు.)